# త్రిశంకుని మీద తిరుగుబాటు

- రామవరపు గణేశ్వరరావు

అమెరికా నుంచి సుబ్బు రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాను.

"వధువు కావాలన్న ప్రకటనలు ఇచ్చానని రాశావు. ఈ పాటికి జవాబులు చాలా వచ్చే ఉంటాయి. పదిహేను రోజుల సెలవు మీద వస్తున్నాను. మన ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలంటే ఇప్పటికీ పడి చస్తాను. నీకు తెలీనిదేముంది. నాకు కావలసింది అసలు సిసలైన తెలుగుపిల్ల!"

"ఇప్పటికే అరడజనుసార్లు చదివారు! అందులో అర్థం కానిదేముందట?" అని మా ఆవిడ అడిగింది.

"ఈ తతంగమే నాకర్థం కావటం లేదు. పదేళ్ళుగా అమెరికాలో ఉంటున్నాడు. ఇంకా సంప్రదాయాలు తెలుగుపిల్ల అంటాడు. ఇదెక్కడి గోల!" అంటూ మూలకి చూశాను.

సురభి, సూపర్‌హిట్ పాటల తర్వాత చూపించే సందుగ పెట్టెలాంటి పెట్టె నిండా మా సుబ్బు కోసం వచ్చిన జవాబులున్నాయి. అవన్నీ ఓపిగ్గా చదివి, ఓ అరడజను ఏరాలి! ఓ నెలరోజులుగా నాకూ, మా ఆవిడకు ఇదే పని!

"మా భాగ్యం మీ ఫ్రెండుకు లక్షణంగా ఉంటుందన్న నా మాట వినిపించుకున్నారు కాదు!" అని నిష్టూరం వేసింది.

"టీచర్ భాగ్యమా? నీకేమైనా పిచ్చా? అమెరికాలో ఆవకాయ అమ్ముకునే వాడు కూడా డాక్టరో, ఇంజనీరో కావాలంటాడు!"

"తెలుగు పిల్లయితే చాలని అయనగారు రాయలా?"

"అంటే అరవ, మళయాళీ గాళ్ కాదు, నేనన్న వాళ్ళలో తెలుగు పిల్లని! అర్థం అయిందా, పిచ్చి మొఖమా!" అని అన్నాను.

"సరేలెండి. ఇక బయలుదేరండి. అన్నట్టు, మన బుజ్జి, బామ్మ కూడా ఏర్‌పోర్ట్‌కు వస్తారట!"

"వాళ్ళెందుకూ! పెళ్ళికి వెళుతూ పిల్లిని...."

"ఆగండాగండి! మనం పెళ్ళికి వెళ్ళడం లేదు! పెళ్ళికొడుకుని రిసీవ్ చేసుకోడానికి వెళుతున్నాం. బామ్మని ఎలాగూ ప్లేన్ ఎక్కించం అట, కనీసం ప్లేన్‌ని చూడాలని బయలుదేతోంది. బుజ్జి సంగతి సరేసరి! అమెరికా అంకుల్ వీడియోగేమ్ తెస్తాడని, దానితో ఆడుకోవాలని వాడి హడావిడి!" అంది మా ఆవిడ.

వాడు కనిపించగానే పైనుంచి చేయి ఊపాను. ఈ పదేళ్ళలో బాగా లావయాడు, బట్టతల వచ్చింది. డాలర్లు వెనకవేసిన లక్షణం! వాడు మమ్మల్ని చూసి చేయూపాడు. వాడు లగేజీ అందుకోగానే అందరం జోరుగా చేతులూపాం. వాడు తన కుడిచేతి రెండువేళ్ళు 'వి' ఆకారంటో పెట్టి, ముందుకెళ్ళాడు. మా సంజ్ఞలు వాడికి అర్థం అయినట్లు లేదు. ఏం చేస్తాను, వాడి ఖర్మ! తనో క్లింటన్ అనుకుంటున్నాడు 'వి' చూపిస్తూ! ప్రతీవాడికి ఇదో జబ్బు అయిపోయింది. మొన్నటికి మొన్న, పోలీసులు కోర్టులో హాజరుపరుస్తున్న ముద్దాయిని టి.వి.లో చూపిస్తుంటే, ఆ ఏకాక్షి కూడా 'వి' చూపించడమే!

"ఒరే సుబ్బూ! జబ్బులు పడిపోయేటట్లు అందరం చేతులూపి చెప్పినా, నీకు అర్థం కాలేదేమిట్రా? అటువేపున్న కస్టమ్స్ ఆఫీసర్‌తో నీ సంగతి ముందుగా చెప్పాం. అటెళ్ళక, ఇంకెటో వెళ్ళావ్! ఎంత వడ్డించావేమిటి?" వాడు కారులో కూర్చున్నాక, కోపం పట్టలేక అడిగాను.

"ఎందుకూ? నేనేం తేలేదుగా, గ్రీన్ ఛానెల్లోంచి వచ్చాను" అంటూ వెకిలినవ్వు నవ్వాడు.

ఆరి పిడుగా, ఎంతపని చేశావు? అని మనస్సులో వాడిని తిట్టడం మొదలెట్టాను. మా బుజ్జి మాత్రం వాళ్ళ అమ్మ ఒడితో తలదూర్చి భోరుమన్నాడు.

"నా కోసం హేండ్ ఫోన్ తెమ్మనమని రాయించానే!" మా బామ్మ బయటకే, నిష్టూరంగా అంది - పెరట్లో వడియాలు పెడుతున్నపుడు అది చాలా అవసరం అట!

"మన్‌మోహన్‌సింగ్ పుణ్యమా అని, అక్కడున్నవన్నీ ఇక్కడ దొరుకుతున్నాయిగా! మోత దండుగ అని తేలేదు. అది సరే, మీ వాడెందుకురా అలా..." అని వాడంటుండగా, బుజ్జి మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

"వచ్చావుగా! చేతులూపుకుంటూ! అందుకని!" అని మనస్సులోనే అనుకున్నాను.

భోజనాలయి తీరిగ్గా కూర్చున్నాక, "నీకెలాంటి పిల్ల కావాలో నాకైతే తెలీదు. నీ వివరాలతో ఇచ్చిన ప్రకటనకు వచ్చిన జవాబులివిగో!" అని సందుగపెట్టె వాడి ముందుంచాను.

"ఏమిటీ, ఇంతేనా?"

"సరేలే! ఇవన్నీ చూడాలంటే రోజులు కావు, నెలలు కావాలి. ఇప్పుడు ప్రతీ వెధవా ఫారెన్ వెళ్ళి వస్తున్నాడు. మరేమో తానా, ఆటా అంటూ ఆరునెలలకొకసారి మద్దెల వాయించేవాడిని కూడా తీసుకెళ్ళి సన్మానాలు చేస్తున్నారాయె! వాళ్ళంతా మీ కథలు ఇక్కడికి మోసుకొస్తున్నారు! దాంతో అమెరికా అల్లుళ్ళ మీద మోజు పోయింది!" అని అన్నాను.

ఉలుకూ పలుకూ లేకుండా ఇంకేదో వింత శబ్దం వినిపించి, ఏమిటా అని చూస్తే, సోఫాలో కూర్చున్న పళంగా నిద్రలోకి ఒరిగిపోయి ఉన్నాడు సుబ్బు. మళ్ళీ వాడు నిద్ర లేవడం మర్నాడే! అదేదో జెట్‌లాగ్ అట! వాడికి మిగిలిందిక పదమూడు రోజులే!

మావాడి ఉద్దేశం తెలుసుకుంటే. ఎందుకేనా మంచిదని అడిగాను, "ఒరే సుబ్బూ! కట్నం కానుకలు ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావేమిటి?"

"ఒరే! నా నెలజీతం ఎంతో తెలుసా - పదివేల డాలర్లు! అంటే, మూడులక్షల అరవైవేల రూపాయలు! ఇక్కడివాళ్ళు నాకేం ఇవ్వగలరురా?" అన్నాడు విరగబడి నవ్వుతూ.

ఇచ్చేవాళ్ళుంటే పుచ్చుకుంటాడన్న మాట, వెధవ! కోర్టుపాలయిన బాల మేధావి కుటుంబం వీడికన్నా రాబడి తక్కువయా, కట్నం కోసం పీడించారు? డాలరు విలువ నాకు తెలీదనుకుంటున్నాడు! వాజమ్మ! ఖర్చు పెడితే అది రూపాయే, మిగిలిస్తేనే ముప్పైఆరు!

నా లిస్టులో ఉన్న మొదటి నాలుగూ ఉన్న ఊర్లోని సంబంధాలే! ఇద్దరు డాక్టర్లు, ఒక ఇంజనీరు, ఇంకొకరు సి.ఏ.. అలా అని రాసి పంపారు! ముందవి చూడ్డానికి బయలుదేరాం.

'సి.ఏ' అమ్మాయి బి.కాం చేసి, సి.ఎ పార్టు వన్ మాత్రం చేసిందట! 'ఇంజనీరు' అమ్మాయి అఘాయిత్యం సరేసరి! ఎ.ఎమ్.ఐ.ఇ. స్టూడెంట్‌గా రిజిస్టర్ చేయించుకుంది. పరీక్షకు కూర్చోనే లేదు. డాక్టర్ అమ్మాయిలు, డాక్టర్లే!

"ఆ మధ్య గిర్ ఫారెస్ట్‌కు పిలిచారు. అక్కడున్న అరడజను సింహాలకి ఒకేసారి ఆపరేషన్ నేనే చేసాను! అన్నట్టు అమెరికాలో సింహాలవీ ఉన్నాయా?" అమాయకంగా అడిగిందా పశువుల డాక్టరు.

రెండో డాక్టరు సంస్కృతంలో, 'కాళిదాసు కావ్యాల్లో భార్యా ప్రశంస' అన్న విషయం మీద థీసిస్ రాసింది.

"మీ దృష్టిలో భార్య అంటే ఎలా ఉండాలి?" అని మా వాడిని అడిగి, వాడు జవాబివ్వక ముందే, 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, రూపేచలక్ష్మీ క్షమయా ధరిత్రీ' అంటూ శ్లోకం అప్పచెప్పింది.

మావాడి తెలుగే అంతంత మాత్రం. అమెరికా వెళ్ళాక అది కూడా మరిచిపోయాడు! శ్లోకం విని తారెత్తిపోయాడు. అర్థం నన్నడిగితే చెప్పాను. లక్ష్మీ రంభల మాటేమో గాని, నిండుగా భూదేవిలా ఉందీ పెళ్ళికూతురని! పీటల మీద పెళ్ళికి, పెళ్ళికుమార్తెను తట్టలో కూర్చోపెట్టి పందిరిలోకి తీసుకుని రావాలి. అది ఈ అమ్మాయితో అయేపని కాదని కూడా అన్నాను.

అమ్మాయిల అర్హతల మాటెలా ఉన్నా, అందానికి ఆమడదూరంలో ఉన్నారందరూ!

"మంచి పెళ్ళి సంబంధం చూడరా అంటే, ఇలాంటి



నాసిరకంవి నా కోసం చూస్తావా? ఈసారి పెళ్ళాంతో నేను అమెరికా వెళ్ళాలని లేదా? ఇప్పటికే వారం వేస్ట యింది!" అని విసుక్కున్నాడు.

"నన్నేం చేయమంటావురా? అందరు ఎన్నారైలు కోరే వాళ్ళనే షార్ట్‌లిస్ట్ చేసాను. వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చేయండి అన్నారు కదా అని, వీళ్ళిలా ఘోరంగా, అబద్ధాలు రాస్తారని కల గన్నానా?"

"అసలు నా ఉత్తరం సరిగ్గా చదివావా? తెలుగుపిల్ల అని అండర్‌లైన్ చేయలా?" అని అన్నాడు.

వంటింట్లోంచి అప్పుడే బయటకొచ్చిన మా ఆవిడ సంజ్ఞ చేసింది, వాళ్ళ భాగ్యం గురించి చెప్పమని. నేనది చూడనట్లు ముఖం పెట్టాను.

"అప్పటికీ నేను ముందరినుంచీ చెప్తూనే ఉన్నాను- చదువు అంత ముఖ్యం కాదని! మీ ఫ్రెండు వింటేనా!" అంది మా ఆవిడ.

"అలా అని కాదు, వదినగారూ! అక్కడ ఏం తోస్తుంది చెప్పండి? డాక్టర్లు, ఇంజనీర్లు అయితే ఉద్యోగాలు వెంటనే దొరుకుతాయి". అన్నాడు.

'మా వాడి థింకింగ్ ఎలా ఉంటుందో నే చెప్పలా' అన్నట్టు గర్వంగా మా ఆవిడకేసి చూశాను. పాపం! వాడి డైలాగుతో దాని ముఖం ముడుచుకు పోయింది.

"అసలు సిసలు తెలుగుపిల్ల చాలన్నారు.. అంటే ఒక్క డాక్టరు, ఇంజనీరు మాత్రమేనా?" అంది ఉక్రోషంగా.

"మన సంప్రదాయాలు జీర్ణించుకుని, తెలుగుదనం ఉట్టిపడుతున్న అమ్మాయి ఒక డాక్టరు, ఇంజనీరు అయితే, ఇక కావలసిందేముంది?" అన్నాడు సుబ్బు.

"అమెరికాలో తెలుగుదనం ఎందుకురా? పొద్దున్న వెళ్ళే మనిషి రాత్రికి గాని ఇల్లు చేరుకోరట!" ఈసారి రెట్టించడం నా వంతయింది.

"ఆఫీసులో అవసరం లేదు. మరి ఇల్లంటూ ఉంధిగా! పాతికేళ్ళు నేనెలా పెరిగానో నీకు తెలుసుగా! ఇప్పటికి తు.చ తప్పకుండా అన్నీ చేస్తున్నాను అక్కడ! నేనే కాదు, అక్కడున్న మనవాళ్ళందరూ అంతే!" అన్నాడు సుబ్బు.

స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పదన్నట్లు, అమెరికా వెళ్ళినా ఆంధ్రులు, ఆచారాలు, ఆవకాయలు వదిలి పెట్టరన్న మాట!

"ఏమండీ! మీరు కూడా అమెరికాలో ఉద్యోగం చూసుకోండి! ఎంచక్కా బుజ్జికి భోగిపళ్ళు, చంటికి బొమ్మలకొలువూ, నేను అట్లతద్దీ అక్కడ పెట్టుకోవచ్చు!" అంది మా ఆవిడ.

అది వ్యంగ్యంగా అందో, సీరియస్‌గా అందో తెలీక ముఖానికి చిరునవ్వు పులుముకున్నాను.

మా ఊరి సంబంధం ఒకటి వచ్చింది. ఎంతేనా, మేం పుట్టి పెరిగిన ఊరని, విడిగా పెట్టాను. దాని విషయం చెప్పగానే, సుబ్బు ఎగిరి గంతేసాడు. వీడిమూలంగా కొన్నేళ్ళ తరువాత మా ఊర్లో అడుగు పెట్టాం!

ఊరు మారుతుందని తెలుసు. కాని మా ఊరు చచ్చిపోయింది. మేము కోతికొమ్మచ్చి ఆడుకున్న తోట ఇప్పుడు లేదు. ఈతచెట్ల మీదున్న బంగారు పిచ్చికల గూళ్ళను పీకేవాళ్ళం. ఆ చెట్లనే పీకేసి కంకరరోడ్డు వేసారు. రామసాగరంలో స్నానం చేసేవాళ్ళం. ఇప్పుడది బీటలు వేసిన భూమి! బోరుపంపులున్నాయి కాని నీళ్ళు లేవు, దీపాలున్నాయి కాని, 18 గంటలు కరెంటు కోత!

పెళ్ళికూతురి ఇల్లు మెట్రోల్లోని బంగళాలకి తీసిపోదు. డ్రాయింగురూంలో సోఫాసెట్లు, తివాసీ, గోడలకి ఆయిల్ పెయింటింగ్స్.. అట్టహాసంగా ఉంది. ఎమ్.టి.వి. లో ఆలీషాచినాయ్ 'మేడిన్ ఇండియా' పాట పాడు

తోంది. ఏదో ఫారెన్ సెంట్‌తో గదంతా గుప్పుమంటోంది. ఒక పదేళ్ళ పిల్ల బేటరీ ఆపరేటెడ్ హేర్‌డ్రయర్‌తో తల ఆరబెట్టుకుంటూ వచ్చింది. ఇంకో ఇరవైఏళ్ళ కుర్రాడు హేండ్‌ఫోన్‌లో 'బై.. సీయూ దెన్' అని ఎవరితోనే మాట్లాడాక, మా ఎదురుగా కూలబడ్డాడు. పక్కగదిలోని స్టీరియోలోంచి మడోనా 'వన్ మోర్ ఛాన్స్' అని అరుస్తుంటే, ఆ గోల ఆపేయమని పిల్ల తండ్రి కోప్పడ్డాడు.

పెళ్ళికూతురు వస్తూనే మాతో, 'హాయ్! ఎవిరిబడీ!' అంది.

మా సుబ్బు ఖంగుతిని, వెంటనే జవాబివ్వలేదు. వీడు అమెరికా నుంచి కాదు వచ్చింది, గొర్రెలపాలెం నుంచి అని ఎక్కడ అనుకుని పోతారోనని, నేనే 'హాయ్' అని గట్టిగా చెప్పాను.

ఆ అమ్మాయి తన గురించి గడగడా వాగింది. తెలుగు మీడియం బి.ఎ. అయినా ఇంగ్లీషు మాట్లాడగలదట! స్టార్ టి.వి. లోని 'సాంటా బార్బరా' అస్సలు మిస్ అవదట!

"అమ్మాయికి అన్ని భాషలూ కొద్ది కొద్దిగా నేర్పించాం. గుర్రపుస్వారీ వచ్చు. స్విమ్మింగ్, కారు డ్రైవింగ్, ఫైట్స్, అన్నిరకాల డాన్సులు నేర్చుకుంది!" అని పిల్ల తండ్రి అందుకున్నాడు.

ఈమె సకల కళామతల్లి ఎలా అయిందా అని మేము నోరు వెళ్ళబెట్టడం చూసి, పిల్ల తల్లి "మా అమ్మాయికి తెగసినిమాపిచ్చి! అందుకే హైదరాబాద్‌లోని వెంకట్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఏడాది ఏక్టింగ్ కోర్సు చేసింది!" అని చెప్పింది.

మేం ఎక్కడ నమ్మకపోతామోనని, ఒక వీడియో కేసెట్ పెట్టారు. అందులో పెళ్ళికూతురు నడుం అటూ ఇటూ ఊపాక, పాములా మెలికలు తిరిగింది. ఒక చేయి నడుము మీదుంచి, ఇంకో దానితో దేన్నో పిలిచినట్లు అభినయించింది. తరువాత కుడికాలు ముందుంచి, నడుం బాగా వెనక్కి వాల్చి, విరబోసుకున్న జుత్తును ముందుకు వెనక్కి ఎగరేసింది. చలిజ్వరం వచ్చినదానిలా వళ్ళంతా వణికించింది.

"ఈ కేసెట్ చూసిన అందరూ మా సిస్టర్‌ను ఎంతో బావుందని అన్నారు. అఖరుక్షణంలో 'రంగీలా'లో ఊర్మిళను తీసుకోవడమే కాకుండా, మా సిస్టరిచ్చిన మూమెంట్సన్నీ షేమ్‌లెస్‌గా కాపీ కొట్టించారు" బ్రదర్ అన్నాడు.

మా సుబ్బు పెళ్ళికూతురిలా తల వంచుకునే కూర్చున్నాడు. వాళ్ళ భాగ్యం తప్ప సుబ్బుకి ఇంకెవరూ పనికిరారని మా ఆవిడ గాఢంగా అనుకోవడంతో, అంటీ అంటనట్లు కూర్చుంది. ఒక్క మా బుజ్జి మాత్రం హుషారుగా వీడియో చూశాడు.

పిల్ల తండ్రి "సింహాచలం ఏడీ? దిగుడుబావి అడుగు నుంచి వాటిని తీయమన్నానే!" అని అంటుండగానే, ఒక శాల్తీ వచ్చి బకెట్ అతని ముందుంచాడు.

'ఈ దిగుడుబావి భావమేమి తిరుమలేశ' అని మేం కొట్టుమిట్టాడుతుండగా, "అన్నగారు పోతూ పోతూ మమ్మల్ని ఈ ఇబ్బందిలో పడేసారు. ఏం చేస్తాం? అలవాట్లు మానుకోగలమా? ఏవరి కంటా పడకుండా, భద్రంగా దాచుకుంటున్నాం!" అంటూ విస్కీ బాటిల్ బయటకు తీసాడు.

"అన్నట్లు మీరున్న చోటునుంచి హాలీవుడ్ సిటీ ఎంతదూరం? అక్కడ మనవాళ్ళకు వేషాలు దొరుకుతాయా? మనవాళ్ళు డాన్స్‌స్కూల్స్, ఇడ్లీ దుకాణాలు పెట్టి, వేలకువేలు డాలర్లు సంపాదిస్తున్నారట కదా? నేను ఏకంగా ఏక్టింగ్‌స్కూల్ పెడ్తాను!" అని పెళ్ళికూతురు అంటూండగా కరెంటు పోయింది.

ఏక్టింగ్ స్కూల్ అమ్మాయి విషయం మళ్ళీ మా వాడి దగ్గర ఎత్తలేదు. ఆ కోపంలో నన్ను తన్నినా తంతాడు. మా ఆవిడ చెవిలో జోరీగలా పెట్టే పోరు భరించలేక, అసలు సిసలైన తెలుగు అమ్మాయిని చూపిస్తానని, భాగ్యం వాళ్ళున్న గ్రామానికి బయల్దేరదీసాను.

కొంత ప్రయాణం రైల్లో, ఇంకొంత బస్సులో, చివర్లో మూడుమైళ్ళ నడక! ఒళ్ళంతా హూనమైంది. ఆ గ్రామం అంతా కలిపి వందగడపల లోపే! ఆయనకు అక్కడ పొలాలు, తోటలుండడం వలన ఎలిమెంటరీ స్కూలు టీచరుగా రిటైరయ్యాడు. ఆ ఉద్యోగం ఇప్పుడు భాగ్యం చేస్తోంది.

ఊర్లో ఉన్న నాలుగు పెంకుటిళ్ళలో భాగ్యంది ఒకటి. విశాలమైన ఆవరణ.. ఇంటి ముందు బంతి, చేమంతి పూదోట! కళ్ళాపు జల్లిన గడపలో ముగ్గులు.. ద్వారానికి మామిడిఆకుల తోరణాలు!

"ఇంటి లక్ష్మిని వాకిలి చెబుతుంది!" అని మా ఆవిడ ఒక సామెత పారేసింది.

మా సుబ్బుని రైట్‌ట్రాక్ మీదకు తీసుకొచ్చే మొదటి ప్రయత్నం అది!

కొద్దిగా పసుపు పూసుకున్న ముఖం, కుంకుంబొట్టు (స్టిక్కరు కాదు), తల నిండా మల్లెలు, భుజాల మీదుగా కప్పుకున్న వెంకటగిరి చీరలో లోనికి ఆప్యాయంగా ఆహ్వానించింది భాగ్యం.

మా స్నానాలకి అప్పటికప్పుడు కర్రల పొయ్యి మీద వేడినీళ్ళు కాగించింది. భోజనంలో బూరెలు, బొబ్బట్లు వడ్డించింది. సుబ్బు వాళ్ళమ్మపోయి పాతికేళ్ళవుతోంది. మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత అలాటి భోజనం చేస్తున్నానని అన్నాడు.

"భోజ్యేషు మాతా- అంటే భార్య అన్నం పెట్టేటప్పుడు తల్లిలా ఉంటుందట!" అని మా ఆవిడ రెండో రాయి వేసింది.

భాగ్యం నాన్న వాళ్ళ కొబ్బరి, మావిడి, పనసతోటలను చూపించాడు. సొంత ఊరిమీద మమకారంతో అక్కడ ఉండిపోయానని, డబ్బుకు తమకు లోటేం లేదని చెప్పాడు.

"మీ అమ్మాయిని పై చదువులు చదివించలేకపోయారా?" అన్నాడు సుబ్బు. భాగ్యం నచ్చినట్టుంది కాని ఆమె చదువు పట్టించినట్లు లేదు వాడికి.

"భాగ్యం బి.ఎ. మేథ్స్‌లో ఫస్టొచ్చింది. ఎమ్.సి.ఎ చేస్తే ఎంతో రాణించేది. తలుచుకుంటే ఏదైనా సాధించగల కార్యదక్షత ఉంది దానిలో!" అని మూడో రాయి విసిరింది మా శ్రీమతి.

"టీచరు తన పిల్లలు లెక్చరర్లు కావాలని, లెక్చరర్లు తన పిల్లలు ప్రొఫెసర్లు అవాలని అనుకోవడం సహజం! మా అమ్మాయి పెద్ద పదవులకి వెళ్ళాలని నేను ఆశించాను. కాని దానిది వింత మనస్తత్వం! ఇక్కడే ఉంటాననంటుంది. ఉద్యోగమే బావుందంటుంది!" అని నవ్వాడు భాగ్యం తండ్రి.

ఇంకో రోజు ఉందామన్నాడు సుబ్బు. మాకు అర్థమైంది. భాగ్యం వాళ్ళకి అర్థమయ్యేలా ప్రవర్తించాడు మర్నాడు. ఆమె ఏ పని చేసినా ఏదో వంకతో మెచ్చుకోసాగాడు. అమెరికాలో కంప్యూటర్ కోర్సులెన్నో ఉన్నాయట. ఓ ఏడాది చేస్తే చాలు, నెలకి మూడువేల డాలర్ల ఉద్యోగం ఒడిలోకి వస్తుందట! భాగ్యం తండ్రితో అమెరికా చూడని జన్మ జన్మే కాదన్నాడు.

ఆ సాయంత్రమే భాగ్యంతో, "నేను చాలామంది అమ్మాయిలను చూసాను. అందరిలోకి మీరే నచ్చారు. ఇంకో ఐదు రోజుల్లో అమెరికా వెళ్ళాలి. నాకు అభ్యంతరం లేదు. వెంటనే ముహూర్తం పెట్టించమని మీ నాన్నతో చెప్తాను!" అని సుబ్బు అన్నాడు.

"నేను మీకు నచ్చాను, సరే! మరి మీరు నాకు నచ్చారో లేదో అడగరేం?" అని భాగ్యం కుండ బద్దలు కొట్టినట్లు అనడంతో మావాడు పప్పులో కాలెక్కడ వేశాడో తెలిసింది.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం వాడి వంతయింది. తెలుగుపిల్ల కావాలని, ఓ అరడజను అమ్మాయిలను వద్దన్నాడు. తీరా ఆ తెలుగుపిల్ల దొరికిందనుకుంటే, ఆమె కాస్తా వీడిని త్రిప్పి కొట్టింది!

"మీ గురించి అంతా విన్నాను. ఈ రెండురోజులు చూసాక, మీ గురించి ఒక అభిప్రాయానికి వచ్చాను. మీరు క్షమిస్తానంటే అది చెప్తాను. సారీ, సుబ్బారావుగారూ! మీకేం కావాలో మీకు సరిగ్గా తెలీదు.

"మీరు నచ్చారు, పెళ్ళి చేసుకుంటా, నాతో ఇక్కడే ఉండిపోండి, అని నేనే మీతో అంటే, ఉంటారా? ఉండరు. అమెరికన్ డాలర్లు వదలలేరు. అక్కడుంటున్న అమ్మాయిలు మీకు అక్కర లేదు. ఎందుకంటే వాళ్ళ డేటింగ్ పద్ధతులు మీకు నచ్చవు! పదహారణాల పతివ్రతలు కావాలి. దాని కోసం ఇండియాకు రావాలి, ఏ డాక్టరో, కంప్యూటర్ ఎక్స్‌పర్టో కావాలి. ఓ వారంలో చూపులు - పెళ్ళి అయి వెనక్కి వెళ్ళిపోవాలి. ఇదేం పెళ్ళి, సుబ్బారావుగారూ? ఎ మేరేజ్ ఆఫ్ కన్వీనియెన్స్!

"నేను నచ్చాను. మరి నా చదువు నచ్చిందా? అక్కడికొచ్చాక నన్ను ఇంకా చదివిస్తారు. డాలర్లు కనే యంత్రంగా మారుస్తారు, ఔనా? మీరు తెలుగుదనంపై చూపిస్తున్న ప్రేమ పైపైనే- అంతా సూడో! మిసిసిపీలో క్రిష్ణా, గోదావరి, కాలిఫోర్నియాలో కోనసీమకొబ్బరి, రిచ్‌మండ్‌లో రాయలసీమ అందాలు చూడాలని అనుకుంటారు. పిట్స్‌బర్గ్‌లో తిరుపతి వెంకన్న బ్రాంచి అఫీసు పెడతారు. హ్యూస్టన్‌లో మీనాక్షికి ఎక్స్‌టెన్షన్ కౌంటర్ కావాలంటారు. ఆటాలో ఆడడానికి, 'తానా'లో త్యాగరాజకృతులు పాడడానికి మాత్రమే అచ్చమైన తెలుగు అమ్మాయి భార్యగా కావాలి. అక్కడున్న నలుగురినీ కలుసుకునేందుకు మీ భార్య గౌరీపూజలు,వరలక్ష్మీ వ్రతాలూ చేయాలి. బొమ్మల కొలువులు పెట్టాలి.

"సారీ, సుబ్బారావుగారూ! మీ త్రిశంకు స్వర్గం నాకక్కర లేదు. డాలర్ల మీద మోజున్న చాలామంది మీకు దొరుకుతారు. వారిలో ఒకరిని ఎంచుకోండి. నన్ను మాత్రం ఇలా ఉండనీయండి!"

పాపం! మా సుబ్బు పెళ్ళి కాకుండానే అమెరికా ఫ్లైట్ ఎక్కేసాడు. ❑